సాక్షి ఒడిశా
బుధవారం । 16 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 8,01,254

- భువనేశ్వర్/పూరీ

మువ్వన్నెల రెపరెపలు



రాష్ట్రవ్యాప్తంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్నిచోట్ల జాతీయ పతాకాన్ని ఎగురవేసి, స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటాలని వక్తలు పిలుపునిచ్చారు.

- 8లో

కుప్పకూలిన ఉపాధ్యాయుడు



పూరీ జిల్లా కృష్ణ ప్రసాద్ మల్లేశ్వరి ప్రాజెక్టు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. జెండా ఎగురవేసిన అనంతరం హెచ్‌ఎం కుప్పకూలి మృతి చెందారు.

- 8లో

జెండా.. మదినిండా..!

రాష్ట్రవ్యాప్తంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వినువీధుల్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడగా, జన గళమున జన గణమన ప్రతిధ్వనించింది. ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటాలని వక్తలు పిలుపునిచ్చారు. ఎందరో అమరవీరుల త్యాగ ఫలమే దేశానికి స్వాతంత్ర్యమని, దానిని కాపాడుకుంటూ ఆస్వాదిద్దామని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: కటక్ జిల్లా కిసాన్ నగర్ రైతులు తమ పొలంలో పచ్చని వరినారుతో దేశభక్తి చాటుకున్న దృశ్యం



కొరాపుట్: బాలికకు మిఠాయి తినిపిస్తున్న దృశ్యం



రాయగడ: విద్యార్థుల నృత్య ప్రదర్శనలు



జయపురం: పట్టణంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బరంపురం: జాతీయ పతాకాలతో బైక్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న యువకుడు



మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో 600 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన



పర్లాకిమిడి: ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన

నవ ఒడిశాను ఆవిష్కరిద్దాం

- ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పిలుపు
- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



బాలలకు స్వీట్స్ పంచిపెడుతున్న సీఎం నవీన్

భువనేశ్వర్: రాష్ట్రాభివృద్ధి కోసం ఐక్యతతో ఉండి నవ ఒడిశాను ఆవిష్కరిద్దామని సీఎం నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక యూనిట్ – 3 ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు వర్గాల జవాన్ల గౌరవ వందనం అందుకున్నారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, రాష్ట్రానికి చెందిన పలువురు స్వాతంత్ర్య సమరయోధుల సేవలు రాష్ట్ర పురోగతికి తొలి బీజం నాటాయని స్మరించారు. సమాజంలోని అన్నివర్గాల సమ్మిళిత అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి పౌరులు సహకరించాలని మరియు మద్దతు ఇవ్వాలని కోరారు.

5టీతో కొత్త వెలుగులు

విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యాటకం, మౌలిక సదుపాయాలు మరియు ఇతర రంగాలు 5టీ కార్యాచరణ కింద కొత్త వెలుగులను చూస్తున్నాయన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడిందని, పేదరికం తగ్గుముఖం పట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి లక్షల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇటీవలి క్యాబినెట్ నిర్ణయాల గురించి మాట్లాడుతూ.. ఒడిశాలోని ప్రతీ పంచాయతీలో నివసించే ప్రజలకు త్వరలో బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వం 4,373 బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని పంచాయతీల్లో ఈ సేవలు లభిస్తాయని ప్రకటించారు. ఈ చొరవతో వయో వృద్ధులు, మహిళలు మరియు దివ్యాంగులు ప్రధానంగా లబ్ధి పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. మధుబాబు పింఛన్ పథకానికి మరో 4 లక్షల మందిని లబ్ధిదారులుగా చేర్చినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వారికి పింఛన్ అందుతుందని ప్రకటించారు.



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

ప్రతిప్రాణం అమూల్యమైనది

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ప్రాణం అమూల్యమైనదని సీఎం అన్నారు. బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన కింద ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్నట్లు వెల్లడించారు. మహిళల సారథ్యంలో మిషన్ శక్తి అభివృద్ధి బాటలో పరుగులు తీయించే ఇంజిన్‌గా ఉద్భవించడం విశేషమన్నారు. జగన్నాథ్ సంస్కృతిని పరిరక్షించడంతో పాటు ప్రతి గ్రామంలో ఆధునిక డిజిటల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.4,000 కోట్లతో అమొ ఒడిశా నవీన ఒడిశా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. దీని కింద ఏటా లక్ష మందికి ప్రత్యేక శిక్షణ కల్పించనున్నారు. అనంతరం దేశ శాంతి భద్రతల కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్లకు నివాళులర్పించారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం ప్రపంచ చరిత్రలో కొత్త శకానికి నాంది పలికిందన్నారు. చంద్రయాన్ 3ని విజయవంతంగా ప్రయోగించడంతో అంతరిక్ష పరిశోధనలో భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన బాలలతో ముఖ్యమంత్రి ముచ్చటించారు.

స్కూల్ బస్ బోల్తా

- 12 మంది విద్యార్థులకు గాయాలు



పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్‌లో స్కూల్ బస్ బోల్తాపడిన ఘటనలో 12 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పద్మపూర్‌లోని సన్‌షైన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కోసం స్కూల్ బస్‌లో స్కూల్‌కి వెళ్లారు. వేడుకలు ముగిసిన అనంతరం విద్యార్థులను బస్సులో తీసుకొని వెళ్తుండగా, పేరుపంగ గ్రామం వద్ద అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో 12 మంది విద్యార్థులు ఇరుక్కుపోయారు. అదే సమయంలో పక్కనే పంటపొలాల్లో పనిచేస్తున్న కూలీలు పరుగుపరుగున వెళ్లి బస్సు కింద ఇరుక్కుపోయిన విద్యార్థులను బయటకు తీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మరి కొంతమంది విద్యార్థులను బయటకు తీసి పద్మపూర్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే ఘటనలో ఎవరికీ ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గాయాలు తగిలిన విద్యార్థులంతా 8 సంవత్సరాల వయస్సు కలిగినవారు అని సమాచారం. వారి వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతోనే ప్రమాదం చోటుచేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

పర్లాకిమిడి: చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో స్థానిక జంగం వీధిలోని సింహాద్రి అప్పన్న ఫంక్షన్ హాలులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది స్వాతంత్ర్య సమరయోధులు, విశ్రాంత ఆర్మీ కమాండెంట్‌లను సన్మానించారు. చైతన్య సమితి కార్యదర్శి బి.జనార్ధనరావు, అధ్యక్షుడు బి.ఆనందరావు, కామాండెంట్ మల్లికార్జున పట్నాయక్, ఎన్.మహారాణా, కెప్టెన్ ఎస్సీ దాస్, శివశంకర పాణి, పి.రమణయ్య, వీరనారి పద్మావతి, ఆర్మీ మనోజ్ దాస్, బీ.ఎస్.ఆచార్యలకు దుశ్శాలువతో సన్మానం చేశారు. కార్యక్రమంలో జి.నానాజీ, ఐ.వెంకట్రావు, ఎస్.ఎన్.పండా తదితరులు పాల్గొన్నారు.



ఆర్మీ కమాండెంట్ మల్లికార్జున పట్నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఉమ్మడి భాగస్వామ్యం ఉన్నతికి సోపానం

- డీఆర్‌ఎం హెచ్.ఎస్.బాజ్వా



మాట్లాడుతున్న డీఆర్‌ఎం హెచ్.ఎస్.బాజ్వా



అవార్డు అందుకుంటున్న అక్షయ కుమార్ బారిక్



అవార్డు అందుకుంటున్న అమ్య ప్రసాద్ సాహు

భువనేశ్వర్: రైల్వేలో అన్నివర్గాల ఉమ్మడి భాగస్వామ్యమే ఉన్నతికి సోపానమని డీఆర్‌ఎం హెచ్.ఎస్.బాజ్వా అన్నారు. మండల స్థాయి భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖుర్దా రోడ్ రైల్వే స్టేడియంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వేలో ఖుర్దారోడ్ రైల్వే మండలం తూర్పు కోస్తా రైల్వే జోన్‌కి తలమాణికంగా నిలుస్తుందన్నారు. అన్నివర్గాల సిబ్బంది నిరంతర కృషి, గుర్తింపు పొందిన కార్మిక సంఘాల సంక్షేమ ధోరణి ఈ విజయానికి దోహదపడిందని తెలిపారు. అనంతరం పలు క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. స్థానిక విద్యా సంస్థల బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

రైల్వే రక్షకులకు సత్కారం

విధి నిర్వహణ రంగంలో విశిష్ట సేవలతో అంకిత భావం ప్రదర్శించిన ఇద్దరు రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) జవాన్లకు ప్రతిష్టాత్మక డైరెక్టర్ జనరల్ ఇన్‌సిగ్నియా సిల్వర్ డిస్క్ ప్రదానం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఆర్‌ఎం బాజ్వా వీరివురికి ఈ బహుమానం ప్రదానం చేసి ప్రత్యేకంగా సత్కరించారు. ఈ పురస్కారం అందుకున్న వారిలో రైల్వే రక్షక దళం సబ్–ఇన్‌స్పెక్టర్లు అక్షయ కుమార్ బారిక్, అమ్య ప్రసాద్ సాహు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ సాబొరొ తదితరులు

రాయగడ: సదరు సమితి పరిధిలోని నకిటి పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో సబ్ కలెక్టర్ భీమసేన్ సాబొరొ మంగళవారం 53 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసుంధర పథకంలో భాగంగా పేదలకు ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రియదర్శిని స్వాయి, అదనపు తహసీల్దార్ పరశురాం భత్ర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దేవిప్రసాద్ మల్లిక్, రెవెన్యూ శాఖ అధికారి అశోక్ కుమార్ బవురి, అమిన్ దేవరాజ్ గంట పాల్గొన్నారు.

‘సమస్యలు పరిష్కరించాలని వినతి’



సబ్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చాంబర్ ప్రతినిధులు

జయపురం: పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించాలని జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నూతన సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడను మంగళవారం కలిశారు. పట్టణంలో భూ సమస్యలు పరిష్కరించాలని, నేరస్తులను పట్టుకునేందుకు వీలుగా అత్యాధునిక సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన వైద్య కేంద్రంలో సిటీ స్కాన్ యంత్రం లేకపోవడం వలన రోగులు, గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. ఎంఆర్ఐ యంత్రాల ఏర్పాటు, రెండు ఇకో మిషన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జయపురంలో కేంద్ర విద్యాలయం ఏర్పాటు చేయాలని, చారిత్రాత్మక జయపురం జగన్నాథ్ సాగర్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని విన్నవించారు. సబ్ కలెక్టర్‌ను కలిసినవారిలో చాంబర్ అధ్యక్షుడు వి.ప్రభాకర్, డైరెక్టర్లు ఎ.శ్రీనివాసరావు, గెంబలి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పులి మృతి



రహదారి పక్కన పడివున్న పులి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి 126 గ్రామం వద్ద 326వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని పులి మృతి చెందింది. మంగళవారం ఉదయం అటుగా వచ్చిన స్థానికులు పులి చనిపోవడాన్ని గమనించి కలిమెల అటవీ శాఖకు సమాచారం అందించారు. అడవి పులి తలకు బలమైన గాయం తగలడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందిందని అధికారులు తెలియజేశారు. మృతదేహాన్ని అటవీ శాఖ అధికారులు ఖననం చేస్తామని పేర్కొన్నారు.

23 కిలోల గంజాయి స్వాధీనం



అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 23 కిలోల గంజాయిని సురడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి తెలిపిన వివరాల మేరకు.. కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి బైక్‌పై అక్రమంగా గంజాయిని తరలిస్తున్న సమాచారం అందుకున్న సురడా పోలీసులు రెక్కీ నిర్వహించారు. దీనిలో భాగంగా మార్గమధ్యలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానంతో ఒక బైక్‌ను తనిఖీ చేయగా 23 కిలోల గంజాయి బయటపడింది. దీంతో మోటారు బైక్‌తో పాటు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారు బీహార్ రాష్ట్రం రామ్‌పూర్ గ్రామానికి చెందిన పప్పు దాస్ మరియు రూదల్ కుమార్‌లుగా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.



భువనేశ్వర్: నగరంలో 1,200 మీటర్ల పొడవైన జాతీయ పతాకం ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



జయపురం: మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ పరిద



జయపురం: పరేడ్ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు



జయపురం: గౌరవ వందనం సమర్పిస్తున్న ఎన్‌సీసీ మహిళా కేడర్



బరంపురం: గౌరవ వందనం స్వీకరిస్తున్న దక్షిణాంచల్ ఆర్డీసీ ఆహొగా ఆవో



బరంపురం: బాపూర్ బజార్‌లో ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు...



జయపురం: గౌరవ వందనం సమర్పిస్తున్న రెడ్‌క్రాస్ కేడర్



పర్లాకిమిడి: సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ తదితరులు



పర్లాకిమిడి: శ్రీకృష్ణచంద్ర గజపతి అటానమస్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల కవాతు

మువ్వన్నెల రెపరెపలు

ఎందరో అమరవీరుల త్యాగ ఫలమే దేశానికి స్వాతంత్ర్యమని వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం వాడవాడలా మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది. కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ సంస్థల ప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: పార్క్ వీధిలో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



బరంపురం: బీజేడీ కార్యాలయంలో వేడుకలు...



పర్లాకిమిడి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆకట్టుకున్న సవర నృత్యం



కొరాపుట్: గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి రణేంద్ర



జయపురం: మెయిన్ రోడ్డులో భారీ జాతీయ జెండా ప్రదర్శన



రాయగడ: క్రీడాకారిణి నేహా పట్నాయిక్‌ను సన్మానిస్తున్న దృశ్యం



రాయగడ: పరేడ్ నిర్వహిస్తున్న దళాలు



రాయగడ: వేడుకల్లో పాల్గొన్న నెక్కంటి తదితరులు



రాయగడ: గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి అతున్ సవ్యసాచి



జయపురం: మిళిత శ్రామిక సంఘ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జయపురం: ఆటో చాలక సంఘం కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



జయపురం: సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే పద్మినీ దియాన్



కొరాపుట్: తన స్వగ్రామంలో జెండా ఎగురవేస్తున్న నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మజ్జి



కొరాపుట్: కొరాపుట్ స్టేడియంలో పొట్టంగి ప్రాంత రైతుల శకటం



కొరాపుట్: కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు



మల్కన్‌గిరి: గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి తుషార్ కాంత్ బెహర



మల్కన్‌గిరి: జెండా ఎగురవేస్తున్న మంత్రి తుషార్ కాంత్



మల్కన్‌గిరి: పరేడ్‌లో పాల్గొన్న పోలీసులు



మల్కన్‌గిరి: పరేడ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

కుప్పకూలిన ఉపాధ్యాయుడు

భువనేశ్వర్: స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఊహాతీత విషాదం చోటు చేసుకుంది. జాతీయ పతాకం ఆవిష్కరించిన మరుక్షణం ప్రధాన ఉపాధ్యాయుడు ప్రఫుల్ల చంద్ర సాహు కుప్పకూలాడు. వైద్యులు ఆయన మృతి చెందినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ విషాద సంఘటన పూరీ జిల్లా కృష్ణ ప్రసాద్ మల్లేశ్వరి ప్రాజెక్టు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అలరించిన దేశభక్తి గీతాలు



శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో సాంస్కృతిక మండలి, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం దేశభక్తి గీతాల నృత్య ప్రదర్శన చక్కగా జరిగింది. చైతన్య టెక్నోస్కూల్ విద్యార్థులు స్వాగతం, ఆర్సీఎం లయోలా పాఠశాల విద్యార్థులు జయతు జయతు, టీపీఎంహెచ్ స్కూల్ శివానీ, భవానీ, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు భరతఖండమే నా దేశం, సాయిమందిరం విద్యార్థులు ఈ జెండా అమరుల చిరునవ్వురా తదితర గీతాలతో అలరించారు. ముందుగా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఇతర అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.

న్యాయవాదులు క్రమశిక్షణతో మెలగాలి



బార్ కార్యాలయంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆకాంక్షించారు. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు క్రీడాస్ఫూర్తిని చాటుతూ ఆటల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఆటలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, షటిల్, క్యారమ్స్, చెస్‌తో పాటు పాటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించి వారిని అభినందించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి కె.శ్రీదేవి, మూడో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎస్.మహేంద్ర ఫణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ సివిల్ జడ్జి అనురాధ, బార్ కౌన్సిల్ ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుల ఆశయాల మేరకే పాలన

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): స్వరాజ్య సాధనలో ఉద్యమించిన మహనీయుల ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి సుపరిపాలనను అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో చంద్రమహల్‌కి ఎదురుగా ఉన్న పార్టీ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయలేని మార్పుల్ని సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చారని చెప్పారు. 98.5 శాతం వాగ్దానాలను అమలు చేసిన ప్రభుత్వం కూడా ఇదేనని అన్నారు. 45వేల స్కూళ్ల రూపురేఖలు మార్చారని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే పరిస్థితి ఇప్పుడు లేదని, అన్ని సేవలు ఇంటి వద్దకే తెచ్చి అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలన్నీ అక్కచెల్లెమ్మల పేరు మీదే ఇస్తూ రూ.2.31 లక్షల కోట్లను నేరుగా ప్రజలకు అందించారని వివరించారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ అధికారంలో ఉన్నన్నాళ్లూ ప్రజల్ని దోచుకున్న చంద్రబాబునాయుడు, అతని అనుచరులు ఇప్పుడు ఎన్నో నీతి కబుర్లు చెబుతున్నారన్నారు. జిల్లాలో వంశధార, ఆఫ్‌షోర్, తోటపల్లి తదితర ప్రాజెక్టులకు ఆద్యులు దివంగత వైఎస్సార్ అయితే వాటి కోసం తాను ఎంతో చేశానంటూ చంద్రబాబు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ఎంపీ పద్మావతి, పైడిశెట్టి జయంతి, చల్ల అలివేలు మంగ, సాధు వైకుంఠరావు, పొన్నాడ రుషి, ఎన్ని ధనుంజయరావు, శిమ్మ రాజశేఖర్, ఎం.ఎ రఫీ, సిజు, ఎం.ఎ బేగ్, మూకళ్ళ తాతబాబు, రౌతు శంకరరావు, టి.కామేశ్వరిలతో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయవాడలో ధర్నాకు అనుమతి లేదు

అరసవల్లి: జిల్లాలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విజయవాడలో ధర్నాకు సిద్ధమవుతున్నారని సమాచారం ఉందని, అయితే ఈ ధర్నాకు ఎలాంటి అనుమతులు లేవని చీఫ్ విజిలెన్స్ అధికారి ఏపీఎల్ ప్రసన్నకుమార్ స్పష్టం చేశారు. ఈనెల 17న నిర్వహించతలపెట్టిన ఈ ధర్నాకు ఎలాంటి ముందస్తు అనుమతులు లేవని విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారని, ఈ క్రమంలో జిల్లాలో ఎవ్వరూ ఈ ధర్నా కోసం వెళ్లి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేశారు.

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల



డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ఆరో సెమిస్టర్ (చివరి సెమిస్టర్) ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మంగళవారం విడుదల చేశారు. ఈ పరీక్షలు జూన్ 27 నుంచి జూలై 11 వరకు నిర్వహించారు. మొత్తం 11,884 మంది హాజరు కాగా, 5799 మంది ఉత్తీర్ణత సాధించారు. 49 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫలితాలు జ్ఞానభూమి వెబ్ సైట్‌లో పొందు పర్చారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీ వాల్యుయేషన్ కోసం 15 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఈదుపురం కల.. నెరవేరిన వేళ



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఈదుపురం పీహెచ్‌సీ

ఇచ్ఛాపురం రూరల్: దశాబ్దాల ఈదుపురం వాసుల కల నెరవేరబోతోంది. మత్స్యకార గ్రామాలతో పాటు సుమారు పాతిక గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మిగిలిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీ రామ్మోహన్‌నాయుడులు ఈదుపురం ప్రాంతంలో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మిస్తామంటూ ఇచ్చిన హామీ బాహుదానదిలో కలసిపోయింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్‌ల కృషితో 2021 జూలై 9న అప్పటి ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాసు చేతులు మీదుగా ఈదుపురంలో నాబార్డ్ నిధులు రూ.185 లక్షలతో ప్రభుత్వ ఆస్పత్రి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమైందని ఆర్అండ్‌బీ డీఈఈ ఎస్.రామినాయుడు తెలిపారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి



పైడిరాజు(ఫైల్)

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆముదాలవలస జీఆర్‌పీ ఎస్సై సీహెచ్.శ్రీనివాసరావు ఈ ఘటనపై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని విజయాకాలనీకి చెందిన అలజంగి పైడిరాజు(34) సోమవారం రాత్రి గరివిడి మండలం బొండపల్లి గ్రామంలో అత్తవారింటికి వెళ్లాడు. అక్కడి నుంచి మంగళవారం ఉదయం బయల్దేరి చీపురుపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రైల్వేస్టేషన్‌లో ఒకటవ ప్లాట్‌ఫారం నుంచి రెండో ప్లాట్‌ఫారానికి పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా బెంగుళూను నుంచి హౌరా వెళ్తున్న దురంతో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణంలోని పోస్టల్ కార్యాలయం పక్కన సెలూన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబాన్ని పోషించాల్సిన యజమాని రైలు ప్రమాదంలో మరణించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్సై తెలిపారు.

కొత్తవలసలో గుర్తు తెలియని వ్యక్తి..



రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

కొత్తవలస: కొత్తవలస నుంచి పెందుర్తి రైల్వే లైన్‌లో కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందాడు. మృతుడి శరీరంపై ఫుల్‌ప్యాంట్, టీషర్టు ఉన్నట్లు రైల్వే ఎస్సై నాయక్ తెలిపారు. మరే ఇతర వివరాలు తెలియరాలేదన్నారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమతానంద స్వామి అస్తమయం



సమతానంద స్వామీజీ (ఫైల్)

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధి థామస్‌పేటలో గల దుర్గా పీఠం పీఠాధిపతి సమతానంద స్వామీజీ సోమవారం రాత్రి అస్తమించారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో అసువులు బాశారు. తన ఆధ్యాత్మిక ప్రవచనాలతో ఉత్తరాంధ్రలో ఆయన మంచి పేరుప్రఖ్యాతులు పొందారు. స్వామీజీ భౌతికకాయాన్ని భక్తుల సందర్శనార్థం పీఠంలోనే ఉంచారు. బుధవారం ఉదయం దుర్గా పీఠం ఆవరణలో స్వామికి అంత్యక్రియలు జరిపించనున్నట్లు ఆయన ప్రధాన శిష్యుడు శ్రవణ చైతన్య స్వామి తెలిపారు.


కాలువలో మృతదేహం లభ్యం



పిట్ట విజయ మృతదేహం

జియ్యమ్మవలస: పార్వతీపురంలోని జనశక్తి కాలనీకి చెందిన పిట్ట విజయ (65) మృతదేహం జియ్యమ్మవలస మండలంలోని తురకనాయుడువలస ఊరు శివారులో ఉన్న తోటపల్లి ఎడమ కాలువలో మంగళవారం లభ్యమైనట్లు ఎస్సై అనీష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పిట్ట విజయ తోటపల్లి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడగా మృతదేహం కొట్టుకు వచ్చి తురకనాయుడువలస సమీపంలో లభ్యమైంది. మృతురాలి భర్త అప్పలస్వామి (68) రిటైర్డ్ బ్యాంకు మేనేజర్. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనీష్ తెలిపారు.

వెయిట్‌లిఫ్టర్స్‌పై అభినందనల జల్లు



పల్లవికి జ్ఞాపిక అందజేస్తున్న ఇన్‌చార్జి మంత్రి ముత్యాలనాయుడు

విజయనగరం ఫోర్ట్: ఏసియన్, కామన్వెల్త్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులను జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలునాయుడు అభినందించారు. క్రీడాకారులు పల్లవి, బి.హారిక, సీహెచ్ శ్రీలక్ష్మి, ఎస్.గురునాయుడుకు జ్ఞాపికలు అందజేశారు.

తగ్గిన అల్లం ధర

కురుపాం: స్థానిక మార్కెట్లో అల్లం ధర ఒక్కసారిగా పడిపోయింది. గత రెండు వారాల కిందట కేజీ దేశవాళి అల్లం ధర రూ.130 వరకు పలకగా మంగళవారం కేజీ అల్లం ధర రూ.70కు పడిపోయింది. ఒక్కసారిగా కిలోకు రూ.60 తగ్గిపోవడంతో గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు కురవడంతో అల్లంలో నాణ్యత తగ్గే అవకాశం ఉండడంతో డిమాండ్ తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రతిరంగంలోనూ విజయపథం



జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక

- ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటుతో సర్వతోముఖాభివృద్ధి
- విజయనగరం ప్రజల దీర్ఘకాల ఆశ ప్రభుత్వ మెడికల్ కాలేజీ త్వరలోనే సాకారం
- ఉత్తరాంధ్ర అభివృద్ధి దిక్సూచి భోగాపురం విమానాశ్రయం నిర్మాణ పనులు వేగవంతం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు
- ఆనందోత్సాహాలతో 77వ స్వాతంత్య్ర దినోత్సవం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: మహాకవి గురజాడ వెంకటఅప్పారావు, ఆదిభట్ల నారాయణదాసు, ద్వారం వెంకటస్వామినాయుడు, కోడి రామమూర్తి వంటి మహనీయులు నడియాడిన నేల ఇది.. విజయనగరం ఖ్యాతి ప్రపంచవ్యాప్తం.. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిచేయడమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ త్వరలోనే సాకారం కాబోతోందని వెల్లడించారు. విజయనగరం జిల్లానే గాకుండా ఉత్తరాంధ్ర అభివృద్ధికే దిక్సూచి కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. విజయనగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన 77వ స్వాతంత్య్ర దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఘనంగా స్వాగతం పలికారు. జాతీయ పతాకాన్ని ఇన్‌చార్జి మంత్రి బూడి ఆవిష్కరించారు. గౌరవ వందనం సమర్పించారు. పరేడ్‌లో పోలీసు దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. శాంతికి ప్రతీకగా కపోతాలను డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ఎగురవేశారు. అనంతరం ఆహూతులకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోందని చెప్పారు. పటిష్టంగా, అవినీతిరహితంగా, అత్యంత పారదర్శకంగా తాము అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను, జిల్లాలో మైలురాళ్లుగా నిలిచిన కార్యక్రమాలను ఆయన వివరించారు. ఆ ప్రసంగంలో అత్యంత ప్రధానమైన విషయాలు ఇలా...

- జగనన్నకు చెబుదాం: సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు పొందడంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను శతశాతం సంతృప్తికరంగా పరిష్కరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టోల్ ఫ్రీ నంబరు 1902 ద్వారా జిల్లాలో ఇప్పటి వరకూ అందిన 4,649 వినతుల్లో 4,583 పరిష్కారమయ్యాయి.
- జగనన్న సురక్ష: క్షేత్రస్థాయిలో ప్రజలకు 11 రకాల ప్రభుత్వ సేవలను ఎలాంటి రుసుం లేకుండా అందించడానికి జూలై నెలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని 5.16 లక్షల కుటుంబాలను ప్రజాప్రతినిధులు, అధికారులు కలిశారు. 19 ప్రభుత్వ శాఖల పరిధిలోని 111 అంశాల్లో 4.86 లక్షల మందికి ఉచితంగా సేవలు అందాయి.



పోలీసుల గౌరవ వందనం

- గడప గడపకు మన ప్రభుత్వం: సుమారు రూ.74.06 కోట్లతో సిమెంట్ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు, సీసీ డ్రైన్‌లు ఇలా 2454 ప్రాధాన్యత పనులను ప్రజాప్రతినిధులు ప్రతిపాదించారు. వాటిలో రూ.10.06 కోట్ల విలువైన 351 పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. సుమారు రూ.52.83 కోట్ల విలువైన 1858 పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
- ప్రభుత్వ మెడికల్ కాలేజీ: జిల్లా వైద్యరంగ చరిత్రలో మైలురాయిగా నిలిచేలా 70 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రభుత్వం శరవేగంగా నిర్మిస్తోంది. త్వరలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దీన్ని ప్రారంభించనున్నారు.
- భోగాపురం విమానాశ్రయం: భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం, పునరావాసం... ఇలా అన్నీ పక్కాగా పూర్తిచేసిన తర్వాతనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత మే నెలలో శంకుస్థాపన చేశారు. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్నే మార్చేసే ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో పర్యాటకాభివృద్ధితో పాటు 10 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.
- గిరిజన విశ్వవిద్యాలయం: సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మెంటాడ, గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని దత్తిరాజేరు మండలాల సరిహద్దులో 560 ఎకరాల భూమిని ప్రభుత్వం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం అప్పగించింది. రూ.50 కోట్లతో మౌలిక వసతులన్నీ కల్పిస్తోంది. త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం ఉంటుంది.
- మూడో రైల్వే లైన్: బైపాస్ రైల్వే లైన్, ఇతర నిర్మాణాల కోసం 132.46 ఎకరాలను, మూడో రైల్వే లైన్ నిర్మాణానికి 80.82 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. మొత్తం 213.28 ఎకరాలకు గాను ఇప్పటికే 182 ఎకరాలను రైల్వేశాఖకు అప్పగించింది.
- జాతీయ రహదారులు: ఎన్‌హెచ్-130 సీడీ పేరుతో విశాఖ పట్టణం నుంచి రాయ్‌పూర్ వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎన్‌హెచ్516ఇ బొడ్డవర నుంచి విజయనగరం వరకు 25 కి.మీ జాతీయ రహదారి విస్తరణ చురుగ్గా జరుగుతోంది. రాజాపులోవ నుంచి రాయ్‌పూర్ వెళ్లే 26వ జాతీయ రహదారిలో చెల్లూరు నుంచి సాలూరు వరకు రూ.10 కోట్లతో మరమ్మతులు, గజపతినగరం-సాలూరు మధ్య రూ.116 కోట్లతో విస్తరణ పనులు పూర్తయ్యాయి. సుమారు రూ.215 కోట్లతో నిర్మించిన విజయనగరం బైపాస్ రోడ్డు ప్రారంభానికి సిద్ధమైంది. మానాపురం వద్ద రూ.22 కోట్లతో ఆర్‌వోబీ పనులు ప్రగతి దశలో ఉన్నాయి.
- ప్రాధాన్యత భవనాలు: గ్రామస్థాయిలోనూ ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాల్లోనే ఉండేలా ప్రాధాన్యతా భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. 530 గ్రామ సచివాలయ భవనాలకు గాను ఇంతవరకు 392 పూర్తయ్యాయి. 496 ఆర్‌బీకే భవనాలకు 286, అలాగే 435 వెల్‌నెస్ కేంద్రాలకు 182 పూర్తయ్యాయి. సెప్టెంబర్ నాటికి అన్నీ పూర్తి చేయాలన్నదే లక్ష్యంగా నిర్దేశించాం.



- వ్యవసాయానికి మద్దతు: వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం కింద ఈ ఏడాది మొదటి విడతగా 2.58 లక్షల రైతు కుటుంబాలకు రూ.193.74 కోట్ల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించింది. ఈ ఖరీఫ్‌లో రూ.824 కోట్ల పంట రుణాలు మంజూరు చేసింది. 494 రైతు సంఘాలకు రూ.13.89 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ యంత్ర పరికరాలను అందించింది. 11730 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులను జారీ చేసింది. ఈ ఖరీఫ్‌లో సుమారు 43వేల మెట్రిక్ టన్నుల వరి విత్తనాలను అందించింది. 23,052 మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేసింది. ఈసారి 50,366 ఎకరాల విస్తీర్ణానికి ప్రకృతి వ్యవసాయం సాగును పెంచాలనేది లక్ష్యం. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో మొక్కజొన్న ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నాం. ఇటీవల ఎల్.కోట మండలం కళ్లేపల్లిరేగలో ఆరోగ్య మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. 2022-23 ఖరీఫ్ సీజన్‌లో ఆర్‌బీకేల ద్వారా 89,947మంది రైతుల నుంచి 3.42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. వారికి రూ.697.18 కోట్లు నేరుగా చెల్లించింది.
- వైఎస్సార్ మత్స్యకార భరోసా: ఈ ఏడాది వేట విరామ సమయంలో 3,522 మంది మత్స్యకారులకు రూ. 10వేలు చొప్పున ప్రభుత్వం భృతి అందించింది. రూ.23.73 కోట్లతో చింతపల్లి వద్ద ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.
- వైద్య, ఆరోగ్య రంగానికి పెద్దపీట: జిల్లా సర్వజన ఆసుపత్రిని రూ.5 కోట్లతో ప్రభుత్వం ఆధునీకరించింది. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో జిల్లాలోని 48 పీహెచ్‌సీల పరిధిలో నెలలో ప్రతీ గ్రామానికి రెండుసార్లు 104 వాహనంలో వైద్యులు వెళ్తున్నారు. ప్రజలకు అవసరమైన 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. 74 రకాలు మందులను ఉచితంగా అందిస్తున్నారు.
- విద్యారంగంలో సంస్కరణలు: 18,101 మంది విద్యార్థులకు, వారికి బోధించే 3685 మంది టీచర్లకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా ప్రభుత్వం అందించింది. మన బడి నాడు-నేడు పథకం మొదట విడతలో 841 పాఠశాలలను రూ.185 కోట్లతో, రెండో విడతలో 720 పాఠశాలలను రూ.220 కోట్లతో అభివృద్ధి చేసింది. 17 జూనియర్ కళాశాలలను రూ.11.81 కోట్లతో ఆధునీకరిస్తున్నారు. జగనన్న అమ్మఒడి పథకంలో 1,66,180 మంది తల్లుల ఖాతాల్లో రూ.249,27 కోట్లు, జగనన్న విద్యా కానుక కింద 1.40 లక్షల మంది విద్యార్థులకు రూ.35 కోట్ల విలువైన కిట్లు పంపిణీ చేశారు. జగనన్న విద్యా దీవెన పథకంలో గత ఏడాది 46,383 మంది విద్యార్థులకు రూ.56.78 కోట్ల మేర, జగనన్న వసతి దీవెన కింద 43915 మందికి రూ.41.02 కోట్ల మేర చెల్లించారు.
- నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు: మొదటి విడతలో 78,127 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటికే 33,957 పూర్తయ్యాయి. సుమారు రూ.755.58 కోట్ల మేర బిల్లులు చెల్లించారు. టిడ్కో ఆధ్వర్యంలో పట్టణ ప్రాంత ప్రజలకు రూ.391 కోట్ల అంచనావ్యయంతో 6,368 ఇళ్లను నిర్మించాం.
- సామాజిక ఆర్థిక భరోసా: గత ఏడాది కాలంలో 28వేల స్వయం సహాయక సంఘాలకు రూ.1034 కోట్ల మేర బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి ద్వారా 43,223 మందికి రూ.199.43 కోట్ల మేర రుణాలను మంజూరు చేశాం. వైఎస్సార్ చేయూత పథకంలో 1,41,347 మంది మహిళలకు రూ.734,27కోట్లు, వైఎస్సార్ ఆసరా కింద 31,070 స్వయం సహాయక సంఘాలకు చెందిన 3,50,108 మంది సభ్యులకు రూ. 640.27 కోట్ల మేర అందజేశాం. జగనన్న తోడు పథకంలో చిరువ్యాపారులు 76,460 మందికి రూ.76.46 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో 37,851 స్వయం సహాయక సంఘాలకు చెందిన 4.30 లక్షల మంది సభ్యులకు రూ.119.82 కోట్ల మేర అందించాం. జగనన్న చేదోడు కింద 46,915 మందికి రూ.46.91 కోట్లు ఆర్థిక సాయం చేశాం. వైఎస్ ఆర్ కాపునేస్తం పథకంలో 15,856 మందికి రూ.23.78 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 10,710 మందికి రూ.16.06 కోట్ల మేర లబ్ధి కలిగింది. వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం పథకంలో 2,841 చేనేత కుటుంబాలకు రూ.6.81 కోట్లు, వైఎస్‌ఆర్ వాహన మిత్ర పథకంలో 13,830 మంది డ్రైవర్లకు రూ.54.76 కోట్ల మేర సహాయం అందింది.
- సాగునీటి ప్రాజెక్టులు: తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ నుంచి గజపతినగరం బ్రాంచ్ కెనాల్ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.126.61 కోట్లు కేటాయించింది. తారక రామతీర్థసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులను రూ.194.40 కోట్లతో పూర్తి చేయడానికి ఇటీవలే ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే.
- జాతీయ జల్‌జీవన్ మిషన్ మొదటి విడతలో 1,111 పనులకు రూ.200.81 కోట్లు, రెండో విడతలో 1,300 పనులకు రూ.701.70 కోట్లు మంజూరయ్యాయి.
- జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష: తొలి దశలో 179 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యింది. రెండో దశలో 319 గ్రామాల్లో జరుగుతోంది.

స్వాతంత్య్ర దినోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస్ రావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, పాకలపాటి రఘువర్మ, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయయాదవ్, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ డాక్టర్ అవనాపు భావన, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎస్పీ దీపికా పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకలను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వేడుకలకు హాజరైన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు



ఆకట్టుకున్న స్టాల్స్

విజయనగరం ఫోర్ట్: పోలీస్ పేరెడ్ గ్రౌండ్‌లో డీఆర్‌డీఏ, మెప్మా, జిల్లా పరిషత్, స్పోర్ట్స్ అథారిటీ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సర్వే, చేనేత, ఫిష్ ఆంధ్ర, ఐసీడీఎస్, పశుసంవర్ధక, ఉద్యాన, ఏపీఎంఐపీ, విభిన్నప్రతిభావంతుల శాఖలు ఆయా విభాగాల పనితీరు, సాధించిన విజయాలు తెలుపుతూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఇన్‌చార్జి మంత్రి సందర్శించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన పకోడీ, లడ్డూ, సున్నుండలు వంటి వంటకాలను రుచిచూసి బాగున్నాయని కితాబునిచ్చారు.



డీఆర్‌డీఏ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు

విద్యాశాఖ శకటానికి ప్రథమ బహుమతి

విజయనగరం ఫోర్ట్/విజయనగరం అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వ్యవసాయ, డీఆర్‌డీఏ, డ్వామా, విద్య, సమగ్ర శిక్ష, వైద్య ఆరోగ్య, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం, గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ, జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ, అటవీ, విద్యుత్, పంచాయతీరాజ్, పోలీస్, అగ్నిమాపక శాఖలు తమ ప్రగతిని తెలియజేసేలా శకటాలను ప్రదర్శించాయి. వీటిలో విద్య, సమగ్ర శిక్ష ఏర్పాటు చేసిన శకటానికి ప్రథమ స్థానం లభించగా, డీఆర్‌డీఏ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా), రెవెన్యూ శాఖ శకటానికి వరుసగా తర్వాత స్థానాలు లభించాయి. సంబంధిత అధికారులకు మంత్రి ప్రశంసా పత్రాలు అందజేశారు.



ప్రథమ బహుమతి సాధించిన విద్య, సమగ్ర శిక్ష శాఖ శకటం

ఆద్యంతం.. ఆనందదాయకం

విజయనగరం టౌన్: పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్య్రవేడుకల్లో చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆద్యంతం ఆహుతులను కట్టిపడేశాయి. గంట్యాడ మండలం కేజీబీవీ విద్యార్థులు 'ఆలపించిన భారతీ పిలిచిందోయ్..., సెయింట్ మేరీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థుల 'మన దేశం.. భారతదేశం', ద్వారకామయి అంధుల పాఠశాల విద్యార్థుల 'చక్ దే ఇండియా' పిరమిడ్ ప్రదర్శనలు ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నాయి. కొండవెలగాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా.. భక్తిగీతానికి నృత్యంతో అలరించారు. 'పుణ్య భూమి నా దేశం నమో నమామీ... అంటూ ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థులు అద్భుతప్రదర్శన ఇచ్చారు. ఇండియా హమారే ఇండియా అంటూ నెల్లిమర్ల ఏపీ రెసిడెన్షియల్, బియ్యంపేట, చీపురుపల్లి విద్యార్థులు నృత్యంతో చూపరుల ప్రశంసలు అందుకున్నారు. ఉత్తమ ప్రదర్శనలుగా గంట్యాడ కేజీబీవీ, ద్వారకమాయి అంధుల పాఠశాల, ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థుల ప్రదర్శనలు నిలిచాయి. అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.



మువ్వన్నెల రంగులు విదుల్చుతున్న ఫైర్ సిబ్బంది

మామాఅల్లుళ్ల దుర్మరణం

- రాజమండ్రి సమీపంలో బైక్‌ను లారీ ఢీకొనడంతో ప్రమాదం



సంఘటన స్థలంలో మృతి చెందిన వీరఘట్టం వాసి కిక్కర గౌరి

వీరఘట్టం/బాడంగి: పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలోని గొల్లవీధికి చెందిన కిక్కర గౌరి(36), విజయనగరం జిల్లా బాడంగి మండలం పాల్తేరుకు చెందిన బోను సన్యాసి(50)లు రాజమండ్రి సమీపంలోని బొమ్మూరు పోలీసుస్టేషన్ పరిధిలోని దివాన్‌చెరువు హైవే పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు.ఈ విషయాన్ని రాజమండ్రి దివాన్‌చెరువు హైవే పెట్రోలింగ్ సిబ్బంది వీరఘట్టం, బాడంగి పోలీసులకు తెలియజేశారు. ఈ సమాచారాన్ని స్థానిక పోలీసులు వారి కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వీరఘట్టం, పాల్తేరు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

వీరఘట్టానికి చెందిన కిక్కర గౌరి, పిలనిచ్చిన మామ బోను సన్యాసితో కలిసి కుటుంబసమేతంగా నెల్లూరులో నివాసం ఉంటూ రైస్ మిల్లులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అల్లుడు గౌరి ఇటీవల వీరఘట్టంలో 20 సెంట్ల భూమి కొనుగోలు చేశాడు. ఆ పొలంలో వరి పంట వేసేందుకు మామ సన్యాసితో కలిసి వారం రోజుల కిందట బైక్‌పై వచ్చాడు. మామ సన్యాసిని పాల్తేరులో దింపేసి అల్లుడు గౌరి వీరఘట్టం వచ్చాడు. సొంత గ్రామంలో పొలం పనులు పూర్తి చేసుకుని సోమవారం సాయంత్రం వీరఘట్టం నుంచి బైక్‌పై పాల్తేరు వెళ్లాడు. అక్కడి నుంచి మంగళవారం తెల్లవారుజామున మామాఅల్లుళ్లు బైక్‌పై నెల్లూరు బయల్దేరారు. రాజమండ్రి సమీపంలో దివాన్‌చెరువు వద్ద హైవేపై వీరి బైక్‌ను లారీ ఢీకొట్టడంతో అల్లుడు గౌరి అక్కడికక్కడే మృతిచెందగా, మామ సన్యాసి రాజానగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

రెండు గ్రామాల్లో విషాదం

మృతుడు గౌరికి భార్య గీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.రెండు నెలల క్రితం పెద్ద కుమార్తె అంజలి ప్రథమ రజస్వల ఫంక్షన్‌ను వీరఘట్టంలో ఘనంగా నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మరో వ్యక్తి సన్యాసికి భార్య సత్తెమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలియడంతో వీరఘట్టం,పాల్తేరు గ్రామాల నుంచి వారి బంధువులు రాజమండ్రికి బయలుదేరారు.



కిక్కర గౌరి (ఫైల్)



బోను సన్యాసి (ఫైల్)

రైతులకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం

దత్తిరాజేరు: గిరిజన యూనివర్సిటీకి కె.కొత్తవలస జాతీయ రహదారి నుంచి 120 అడుగులు అప్రోచ్ రోడ్డును రైతులకు ఇబ్బందులు కలగకుండా నిర్మిస్తామని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ తెలిపారు. ఎస్.భూర్జవలస పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డు నిర్మాణానికి ఇరు వైపులా భూములు ఉన్న రైతులతో మంగళవారం సమావేశమయ్యారు. గతంలో సేకరించిన స్థలంలో గెడ్డలు ఉన్నందున అక్కడ నిర్మాణం చేపట్టరాదని ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు రోడ్డు మ్యాప్‌ను మార్చినట్టు తెలిపారు. కొత్తగా కొంత భూములు కావాల్సి ఉన్నందున రైతులు సహకరించాలని కోరారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శేషశైలజ

సచివాలయ ఉద్యోగికి రాష్ట్రస్థాయి అవార్డు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శివరాం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పట్నాల అయ్యప్ప.. ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయి అవార్డు వరించింది. జిల్లాలో మాస్టర్ ట్రైనర్‌గా, ఉద్యోగులకు కొత్త సరీ్వసులపై శిక్షణ ఇవ్వడం, క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలను పరిశీలించి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయడం, సర్వీస్ పోర్టల్‌ను తయారు చేయడంలో జీఎస్‌డబ్ల్యూఎస్‌కు అందించిన ఉత్తమ సేవలకు అవార్డు వచ్చింది. విజయవాడలో జరిగిన గ్రామ, వార్డుశాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ డైరెక్టర్ లక్ష్మీషా చేతులమీదుగా అవార్డు అందజేశారు.



రాష్ట్రస్థాయి అవార్డును అందుకుంటున్న డిజిటల్ అసిస్టెంట్ అయ్యప్ప